ong-5_ong-5.qxd 2/6/2026 12:04 AM Page 1



## పదవతరగతి విద్యార్థులకు అల్పాహారం

చీమకుర్తి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త



చీమకుర్తి మండలం గాడిపర్తి వారి పాలెం గ్రామం లో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని ప్రారంభించారు. చీమకుర్తి పట్టణ అధ్యక్షులు ముప్పూరి చలమయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ జ్యోతి వేణు, రైల్వే ఉద్యోగులు పైడిపాగా ఇమ్మనియేలు, జ్యోతి అజయ్ కుమార్ గ్రామ నాయకులు రంపతోటి శివాజీ సహకారం తో 10 వ తరగతి విద్యార్థులకు నిత్యం అల్పాహారం అందిస్తున్నారు. రోజుకి ఒక అల్పాహారం బొండాలు, గారెలు, గుగ్గిళ్ళు, బిస్కెట్‌లు ఆరోగ్యం కోసం అరటిపండు అందిస్తున్నారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రంగారావు, ఉపాధ్యాయులు, బెల్లంకొండ రామచంద్ర రావు, రంపతోటి గోపీచంద్ మరియు 10 వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధిపై రివ్యూ మీటింగ్

జె.పంగులూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయితీ అభివృద్ధి అధికారులు, 14 స్వర్ణ గ్రామముల సిబ్బందితో ఇంటి పన్నులు, యు ఎఫ్ ఎస్ సర్వే, సచివాలయ సిబ్బంది అటెండెన్స్, ఐ. వి. ఆర్. ఎస్. కాల్స్ మొదలగు అంశములపై మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కె. స్వరూప రాణి గురువారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ రివ్యూ మీటింగ్ లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇంటి పన్నులు మరియు అన్నీ రకాల సర్వేలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.వై. ఎంపీడీవో కె.సుమంత్ డి.వై ఎంపీడీవో (జిఎస్ డబ్ల్యూఎస్), పి.శ్రీనివాసుల రెడ్డి, పంచాయతీ అభివృద్ధి అధికారులు, 14 స్వర్ణ గ్రామముల సిబ్బంది పాల్గొన్నారు.

## వైకాపా నేతను పరామర్శించిన సమన్వయకర్త అశోక్ కుమార్

జె.పంగులూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



మండలంలోని కొండమంజులూరు గ్రామంలో ఇటీవల మాతృవియోగం పొందిన వైఎస్ఆర్సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ జంపాని రవిబాబును పరామర్శించిన అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ గురువారం పరామర్శించారు. వీరి వెంట పంగులూరు మండల వైఎస్ఆర్సీపీ కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధా కృష్ణ మూర్తి, స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు ప్రచార కమిటీ కార్యదర్శి కోయి అంకరావు, వైఎస్ఆర్సిపి నాయకులు రాయండి సుబ్బారావు మందా పురుషోత్తం, మరియు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి

ఉలవపాడు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త




మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఉలవపాడు తాసిల్దార్ కి వినతి పత్రం అందించారు. కొత్తగా ప్రవేశపెట్టిన విబిజి రాంజీ స్కింను తక్షణమే రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకానికి 40 రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, పని గ్యారంటీ హక్కును రద్దు చేస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గురువారం ఉలవపాడు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

## లైసెన్స్ షాపులు 5 బెల్టు షాపులు

- రూ.15 అధిక ధరలకు ఏరులై పారుతున్న మద్యం

కొత్తపట్నం, ఫిబ్రవరి 5. ప్రభాతవార్త



మండలంలో ప్రభుత్వం ద్వారా లైసెన్స్ పొంది అధికారికంగా ఐదుమద్యం షాపులు కొనసాగుతుండగా వాటికి అనుబంధంగా అనధికారికంగా అన్ని గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు పట్టి పట్టినట్టు వ్యవహరిస్తున్నారు ఒకవైపు లైసెన్స్ పొంది మద్యం షాపు నిర్వహిస్తున్న నిర్వాహకులు ప్రభుత్వానికి మేము ఎక్కువ చెల్లించి షాపులు రన్ చేయడం ఏమీ చెల్లించకుండానే బెల్ట్ షాపుల ద్వారా జరుగుతుందని వాపోతున్నారు. బెల్ట్ షాపులు నిర్వాహకులు గ్రామాలలో గ్రామ కాపులకు దాదాపుగా 5 నుండి 7 లక్షల వరకు చెల్లించి తమ ఇష్టానుసారంగా మద్యం అమ్ముతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. షాపులకు నిర్ణీత సమయం లేకుండా ఉదయం 7 గంటల నుండి ప్రారంభించి సాయంత్రం 11 గంటల వరకు నిర్వహిస్తున్నారు. షాపులపై ఎక్సైజ్ అధికారులు ఎలాంటి పర్యవేక్షణ లేకుండా తీరు ఉన్నట్లు అర్థమవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతి క్వాటర్ బాటిల్ పై సుమారు పది రూపాయల పైన అదనంగా బోర్డులు పెట్టిఅమ్ముతున్నా..ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం హాస్యాస్పదంగా ఉన్నది. అలాగే గుండమాల, పాదర్తి, ఆలూరు, గాదేపాలెం, గమండ్లపాలెం,రాజుపాలెం, అల్లూరు, మడనూరు గ్రామాలలో లక్షల రూపాయల్లో గ్రామానికి చెల్లించి బెల్ట్ షాపులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. పర్మిషన్ బ్రాందీ షాపులు కన్నా ఎక్కువగా అమ్ముతున్నట్లు సమాచారం. బెల్ట్ షాపులో క్వార్టర్ బాటిల్ పై సుమారుగా 50 రూపాయలు అమ్ముతున్నట్లు తెలిసింది. బెల్ట్ షాప్ నిర్వాహకులు ఎక్కువ మొత్తము అధికారులకు చెల్లించామని మమ్మల్ని ఏమి చేయలేరని మాకు పార్టీ అండదండలు కూడా ఉన్నాయని పేట్రేగిపోతున్నారు. గ్రామాల్లో పేదల యొక్క కుటుంబాల్ని నాశనం చేస్తున్న ఎలాంటి స్పందన లేకుండా అధికారులు ఉన్నారు. దీనిపై ఎక్సైజ్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కనీసం వారానికి రెండుసార్లు అయినా గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడి నిర్వహించాలని కోరుతున్నారు. ఈ నిర్వహించే బెల్ట్ షాపులు కూడా బస్టాండ్ సెంటర్లో జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే కొనసాగిస్తున్నట్లు సమాచారం. నిజంగా ఎక్సైజ్ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే వారిపై దాడి చేసి షాపులు సీజ్ చేయడం ఎంతో కష్టం కాదని ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో కె. స్వరూప రాణి

జె. పంగులూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాంబాబు ఆదేశముల మేరకు జె.పంగులూరు మండల అభివృద్ధి అధికారిణి కె.స్వరూప రాణి ముప్పవరం గ్రామములోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే స్వరూప అనే మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల చదువులు శ్రద్ధగా చదివేల పరిశీలించాలని హాస్టల్ వార్డెన్ కు సూచించారు. హాస్టల్ విద్యార్థులతో వ్యక్తిగతంగా మాట్లాడి హాస్టల్ లో అందుతున్న సదుపాయాలు, వసతులు గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వంట గదిని పరిశీలించి, పిల్లలకు భోజన సదుపాయాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరి పరిశుభ్రంగాను, రుచికరమైన ఆహారం అందించేలా చూసుకోవాలని సూచించారు. హాస్టల్ లోనే ఉంటున్న విద్యార్థులకు వసతులలో ఎటువంటి లోపాలు, ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో హాస్టల్ వార్డెన్, పంచాయితీ కారదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## సౌందర్యలహరి సేవర్చన కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీ పద్మావతి

ఒంగోలు, ప్రభాతవార్త



శ్రీ వాసవి పెనుగొండ క్షేత్ర పీఠాధితులు పరమ పూజ శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి వారి పర్యవేక్షణలో తెనాలి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ లక్ష్మీదేవి తిరునక్షత్రం సంకష్టహర చతుర్థి సందర్భంగా జరిగిన మణిదీపేశ్వరి అమ్మవారికి జరిగిన సౌందర్యలహరి సేవర్చన కార్యక్రమంలో శిద్దా లక్ష్మీ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు అందుకొని వాసవి అమ్మవారి సౌందర్య లహరి సేవలో పాల్గొన్నారు.

# ఉచితం.. పరిమితం

- కొంత మందికే ఉచిత గ్యాస్ సిలిండర్
- జిల్లాలో తెల్లరేషన్ కార్డులు 5లక్షల 16 వేల 806.. సగం మందికి కూడా అందని ఉచిత వంటగ్యాస్
- అర్హత ఉన్నా అందడం లేదని లబ్దిదారులు గగ్గోలు
- గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు

ఒంగోలు, ప్రభాతవార్త

అధికారంలోకి వస్తే తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని గత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత మొక్కుబడిగా కొంత మందికే ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 5లక్షల 16వేల 806 మంది తెల్లరేషన్ కార్డులు ఉన్నారు. వీరు సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే ఆయా గ్యాస్ ఏజెన్సీలకు నగదు చెల్లిస్తున్నారు. ఆ తరువాత చాలా రోజులకు గాని ప్రభుత్వం ఆ సొమ్మును వారి ఖాతాలకు చెల్లించడం లేదు. అవి కూడా కొంత మందికి వస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయి. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబానికి దాదాపు ప్రతి నెల ఒక సిలిండర్ అయిపోతుంది. కాని ప్రతి నాలుగు నెలలకు ఒక చొప్పున మాత్రమే ఉచితంగా ఇస్తుంది. ఈ విధంగా ఏడాదికి మూడు చొప్పున లబ్దిదారులకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఆరు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాల్సి ఉంది. కాని మూడు సిలిండర్లు మాత్రమే అందించింది. అది కూడా కొంత మందికే ఇచ్చి చేతులు దులుపుకుంటుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ పథకానికి అర్హులైన




లబ్దిదారుల్లో కొంత మందికి ఒక సారి, మరి కొంత మందికి రెండు సార్లు మాత్రమే ఇప్పటి వరకు ఉచిత సిలిండర్లు అందాయంటే ఈ పథకం ఏ విధంగా అమలవుతుందో అర్థం చేసుకోవచ్చు. కొంత మందికి మూడు సిలిండర్లు కూడా అందినట్లు సమాచారం. చాలా మంది లబ్దిదారులు తమకు ఉచిత సిలిండర్ల నగదు జమ కావడం లేదని గగ్గోలు పెడుతున్నారు. వీరిపై అధికారులకు ఆయా గ్యాస్ ఏజెన్సీలకు దరఖాస్తు చేసుకున్నప్పటికి ఒక్క రూపాయి కూడా వారి ఖాతాల్లో జమ కావడం లేదు. లబ్దిదారులు ఆయా గ్యాస్ ఏజెన్సీల్లో స్వయంగా వేలిముద్రలు వేసిఉన్న బ్యాంకు ఖాతా వంటివన్ని సరిచేసుకున్నా కూడా నగదు జమ కావడం లేదు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసిన ఎటువంటి ఉపయోగం లేదు. ప్రస్తుతం 2024 నవంబర్ నెలలో ఈ పథకాన్ని ప్రారంభించగా లబ్దిదారుల సంఖ్యలో ఘననీయంగా కోతపెట్టడం ఆందోళన కలిగిస్తుంది. ఈ పథకాన్ని ప్రారంభించి 2024 నవంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు నాలుగు నెలల వ్యవధిలో సుమారు 7లక్షల మందికి ఉచిత సిలిండర్లకు సంబంధించిన నగదు జమ చేశారు. రెండో విడతలో గత ఏడాది మార్చి నుండి జూన్ నెల మధ్య ఆ సంఖ్య ఇంకా పెరిగింది. మూడో విడతలో కొంత మందికి మాత్రమే ఉచిత సిలిండర్ నగదు జమ అయింది. లబ్దిదారుల సంఖ్యను ప్రభుత్వం ఘననీయంగా తగ్గించడంతో వేలాదిమంది తమ గ్యాస్ నగదు పడలేదంటూ పౌరసరఫరాలశాఖ కార్యాలయాలకు తరచు, తహసీల్దార్లకు తరచు ఫిర్యాదు చేస్తున్నారు. అయినప్పటికి ఫలితం లేకపోవడంతో లబ్దిదారులు ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసిందంటూ ఆరోపణలు వినిపిస్తున్నారు.

## ఒంగోలులో మూడు బార్లకు లాటరీ ప్రక్రియ పూర్తి

ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త



ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలోని డిఆర్ఎ ఛాంబర్లో గురు వారం ఓపెన్ కేటగిరి బార్లకు సంబంధించి లాటరీ విధానంలో షాపుల ఎంపిక జరిగింది. జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఆయేషా బేగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని బార్లకు నలుగురు సభ్యులు, మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని 2 బార్లకు 8 మంది సభ్యులు లాటరీలో పాల్గొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా షాపుల కేటాయింపు పూర్తి చేశారు.ఫ్లెక్సీ షాపు యజమానులకు ట్రాఫిక్ పోలీస్ కీలక సూచఒంగోలులోని ట్రాఫిక్ సీఐ కార్యాలయంలో గురువారం నగరంలోని ఫ్లెక్సీల యజమానులతో సీఐ జగదీశ్ సమావేశాన్ని నిర్వహించారు. ఫ్లెక్సీ షాపు ఓనర్స్ తమకు పూర్తిస్థాయిలో సహకరించాలని, ట్రాఫిక్కు ఇబ్బంది కలిగించేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్తులకు గాని, ట్రాఫిక్ పోలీస్ బూత్లకు గాని ఎటువంటి ఫ్లెక్సీలు కట్టరాదని సూచించారు.

## మారకద్రవ్యాలు వద్దు జీవితం ముద్దు

- జిల్లా పోలీసులు డాక్రా మహిళలు, ప్రజా సంఘాలతో కలిసి నూతన చట్టాలపై జిల్లా వ్యాప్త అవగాహన ర్యాలీలు

ఒంగోలు క్రైమ్. ప్రభాతవార్త



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో కలిసి విస్తృత ప్రజా అవగాహన కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలపై నేరాలు, అనధికార చిట్టీలు, మాదకద్రవ్యాలు వలన అనర్థాలు మరియు వాటికి సంబంధించిన చట్టపరమైన రక్షణలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.ప్రజలకు చట్టాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు తెలియజేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్‌తో పాటు కుటుంబాలు నష్టపోతుందని పోలీసులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమం అనంతరం నిర్వహించిన ర్యాలీలో డ్వాక్రా మహిళలు చురుకుగా పాల్గొని, నేరరహిత సమాజం, మహిళల భద్రత, రోడ్డు భద్రత నియమాలు, సైబర్ భద్రతపై నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.ప్రజలతో కలిసి పనిచేసినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమని, మహిళల భద్రత, ప్రజాభద్రతే లక్ష్యంగా ఇలాంటి అవగాహన కార్య క్రమాలు జిల్లావ్యాప్తంగా నిరంతరం కొనసాగు తాయని జిల్లా పోలీస్ శాఖలు స్పష్టం చేశాయి.

## మూడు కిలోల గంజాయి స్వాధీనం

చీమకుర్తి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

చీమకుర్తి మండలం లోని ప్రముఖ వ్యాపార కూడలి మర్రిచెట్ల పాలెం లో గంజాయిని విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను చీమకుర్తి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. చీమకుర్తి సీఐ డి ప్రసాద్ కు ఇక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం అందింది. ఈ మేరకు ఒరిస్సా, బీహార్ కి చెందిన ఐదుగురు వ్యక్తులు అక్రమముగా గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం తో మధ్య వర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీన పరుచుకుని చీమకుర్తి పోలీస్ స్టేషన్కు తరలించారు. చీమకుర్తి సీఐతోపాటు పోలీసు సిబ్బంది కూడా వారి సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## దేశంలో సహకార శిక్షణ- సంస్థలు పెంపుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు, ప్రభాతవార్త




దేశంలో జాతీయ సహకార శిక్షణ మండలి క్రింద అన్ని రాష్ట్రాలలో సహకార శిక్షణ సంస్థల ఏర్పాటు, కేటాయించిన నిధులు, కోర్సులు, లబ్దిదారుల గురించి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా సమాధానమిస్తూ.. జాతీయ సహకార శిక్షణ మండలి దేశంలో జాతీయ స్థాయిలో వైకుంత్ మెహత నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ సంస్థతో పాటు రాష్ట్రాలలో మొత్తం 20 సహకార శిక్షణా కేంద్రాలు నెలకొల్పిందని తెలిపారు. అందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కలిపి హైదరాబాద్‌లో ప్రాంతీయ శిక్షణా సంస్థ స్థాపించబడింది. ఈ జాతీయ సంస్థ రాష్ట్రాలకు మద్దతుతో పాటు అన్ని విషయాలు చూస్తుందని, కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ సహకార రంగంలో జాతీయ స్థాయిలో త్రిభువన్ సహకారి యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని, దీనితో ప్రతి రాష్ట్రం ఒక సంస్థ అనుసంధానింపబడి శిక్షణ తదితర కార్యకలాపాలు నిర్వహించబడుతున్నాయని, 2020-21 నుండి 2024-25 వరకు రూ.241 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గత 5 సంవత్సరాలలో సహకార వ్యాపార నిర్వహణ, విశ్వవిద్యాలయ డిప్లొమా కంప్యూటర్, అధునాతన డిప్లొమా సహకార నిర్వహణ, కరస్పాండెంట్ పాడిపరిశ్రమ, పారిశ్రామిక అంశాలలో శిక్షణా సంస్థలు మొత్తం 270 తక్కువ కాలపరిమితి కోర్సులు ఏర్పాటు చేయగా, 9,566 మంది శిక్షణ పొందారని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## రాష్ట్ర మహాసభలుకు హాజరైన ప్రకాశం జిల్లా ఏపీజేఏసీ

ఒంగోలు, ప్రభాతవార్త




విజయవాడలోని తుమ్మలపల్లె కాలక్షేత్రంలో అమరావతి రాష్ట్ర నాలుగవ మహాసభలుకు ప్రకాశం జిల్లా ఏపీజేఏసీ అమరావతి శాఖ నుండి వివిధ శాఖల ఉద్యోగులు విజయవాడలోని లెనిన్ సెంటర్ నుండి భారీ ర్యాలీ పాల్గొనడం జరిగింది. ఈ ర్యాలీకి బహిరంగ సభకు ఏపీజేఏసీ అమరావతి ఉద్యోగులు 13 బస్సులు పెట్టుకుని 800 మంది పాల్గొనడం జరిగినది ఈ కార్యక్రమంలో ఏపీ జెఎసి అమరావతి చైర్మన్ మరియు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పిన్నిక మధుసూదన్ రావు, ఏపీ జెఎసి అమరావతి జనరల్ సెక్రెటరీ పోలయ్య, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ ఆర్ వాసుదేవరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ట్రెజరర్ ఊతకోలు శ్రీనివాసరావు, కలెక్టరేట్ అధ్యక్షులు సత్యసాయి శ్రీనివాసరావు, రాజేష్, ప్రశాంత్ నాయుడు, ఏపీజేఏసీ ఉమెన్ వింగ్ చైర్పర్సన్ జయలక్ష్మి, మహిళా ఉద్యోగులు వివిధ సంఘాల ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## 10వ తరగతి ఫీజు చెల్లింపుకై మరో అవకాశం: డీఈవో

ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త



జిల్లాలో మార్చిలో నిర్వహించబోయే పదవ తరగతి పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించిన విద్యార్థుల కోసం డీఈవో రేణుక కీలక సూచన చేశారు. ఈ మేరకు గురువారం ఒంగోలులోని డీఈవో కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. తత్కాల్ స్కీం ద్వారా ఫీజు చెల్లించే అవకాశం పొడిగించడం జరిగిందని, ఈనెల 12లోగా అపరాధ రుసుము వెయ్యి రూపాయలు చెల్లించి ఫీజు చెల్లించవచ్చన్నారు. నామినల్ రోల్స్, ఇతర పత్రాలను హెచ్.యంలు ఆన్లైన్లో సమర్పించాలన్నారు.

# హరితాంధ్రప్రదేశ్ సాధనలో ప్రజలు చురుకైన పాత్ర పోషించాలి: కలెక్టర్

ఒంగోలు కలెకటరేట్, ప్రభాతవార్త

హరితాంధ్రప్రదేశ్ సాధనలో ప్రజలు, సంబంధిత ప్రభుత్వ శాఖలు చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ఈ దిశగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంపుపై గురువారం ప్రకాశం భవనంలో ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లా అటవీ అధికారి ( సోషల్ ) రాజశేఖర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కూడా అన్ని విధాలుగా అభివృద్ధి సాధించేలా స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికలో అడవుల పెంపకంపైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇరిగేషన్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మున్సిపల్, విద్య, గిరిజన, పరిశ్రమలు శాఖలు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థలను భాగస్వాములను చేస్తూ రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెరిగేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో సగటున ప్రస్తుతం 30 శాతం ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 2030 నాటికి 37 శాతానికి, 2047 నాటికి 50 శాతానికి పెంచాలన్నది లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అటవీ విస్తీర్ణం 37 ఉందన్నారు. దీనికి 2030 నాటికి మరో ఏడు శాతం జోడించాల్సి ఉందన్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు సంబంధిత శాఖల నుంచి డిమాండును తెలుసుకోవాలన్నారు. ఆ మేరకు మొక్కలు సరఫరా చేసి, నాటించి, పర్యవేక్షించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. అందుబాటులో ఉన్న స్థలాలను అడవుల పెంపకానికి సమర్థంగా వినియోగించుకునేలా భాగస్వాములు దృష్టి సారించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో



డీఎఫ్ఓ (టెరిటోరియల్) వినోద్ కుమార్, డీఈవో రేణుక, ఆర్. ఐ.ఓ. ఆంజనేయులు, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, డ్వామా పిడి జోసఫ్ కుమార్, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్.ఈ. రవి నాయక్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఉద్యానవనం, నీటిపారుదల, జాతీయ రహదారులకు అధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# పాస్ పుస్తకాల సమస్యలకు సత్వర పరిష్కారం

## - తహసీల్దార్ రవి నాయక్



**బల్లికురవ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

భూముల రీ సర్వేలో తప్పులుగా నమోదైన రైతుల భూముల వివరాలను, తండ్రి పేరు, ఆధార్ నెంబర్‌లను సత్వరం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రవి నాయక్ అన్నారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మండల కేంద్రమైన బల్లికురవ, వల్లాపల్లి, వేమవరం, వైదన, కొప్పెరపాడు, కూకట్లపల్లి, ఎస్ఎల్‌గుడిపాడు గ్రామాలకు సంబంధించి, తొలుత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. పాస్ పుస్తకాలలో తప్పులు గుర్తించిన వారు ఆయా గ్రామాల సచివాలయ పరిధిలోని గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్‌కు తెలియపరచాలన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రైతులకు సూచించారు.

### ఎంపీ మాగుంట ఏర్పాటు చేసిన తేనేటి విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రాత్రి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తేనేటి విందు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఉమ్మడి ప్రకాశంజిల్లా శాసనసభ్యుల తో కలిసి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ



**మార్టూరు, ఫిబ్రవరి 5 ,ప్రభాతవార్త**

మార్టూరు మండలంలోని మార్టూరు, వలపర్ల ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి డి.సింగ్ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటిగా మార్టూరులోని ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలోని వివిధ అంశాలను, తరగతి గదులలోని సౌకర్యాలను పరిశీలించారు. తదుపరి వలపర్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల తరగతులను విద్యార్థుల విద్యా ప్రమాణాలను, స్టాక్ రూమ్, వంటశాల, భోజనం సదుపాయాలను పరిశీలించారు. ఈ క్రమంలో భాగంగా డీఈఓ మాట్లాడుతూ రానున్న పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి, ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ పెంపుదల కొరకు ఇప్పటి నుండే ప్రణాళిక చర్యలు తీసుకోవాలని, మండలంలో ప్రతి రోజు15శాతం విద్యార్థులు, రోజువారి 49 మంది ఉపాధ్యాయులు గైర్హాజరవుతున్నారని, మండలంలో ఇంకా 6శాతం అపార్ జనరేట్ కాని విద్యార్థులు, 67 మంది ఆధార్ లేని విద్యార్థులు ఉన్నారని తెలియజేశారు. కావున పై అంశాలలో పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని, తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి డీ, సీ గ్రేడ్ లో ఉన్న విద్యార్థులు ఏ గ్రేడ్, బి గ్రేడ్ కు చేరుకునేలా ప్రయత్నించాలని, ప్రతి విద్యార్థి కూడా ప్రభుత్వం ఇచ్చిన బూట్లు ధరించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎంసీహెచ్ వస్త్రామ్ నాయక్, సీఆర్పీలు జి.రమేష్, పి.శ్రీనివాసరావు, టి.తిరుపతమ్మ, ఎంఆర్సీ సిబ్బంది వాసు, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

## అమ్మ ఆశ్రమంలో అన్నదానం



**మార్టూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం గుంటుపల్లి గ్రామ వాస్తవ్యులు కి.శే మాదాల సుబ్బయ్య 15వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు మాదాల సాంబశివరావు మాదాల రాజేంద్రబాబు సహకారంతో మార్టూరు మండలంలోని మార్టూరు గ్రామంలో అమ్మ ఆశ్రమం నందు పేదలకు అన్నదాన కార్యక్రమం, ఫ్రూట్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, మాజీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, షేక్ ఖాజా హుస్సేన్, రొటేరియన్ చెరుకూరి అంజిబాబు, కొర్రపాటి సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులతో పాటు ఆశ్రమం నిర్వాహకులు గుంటుపల్లి చందు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

### మాచవరం జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన డిప్యూటీ డీఈఓ చంద్రమౌళి



**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

మండలంలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ చంద్రమౌళి గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులను పరిశీలించి తరువాత ప్రధానోపాధ్యాయులు బి.శివరాం ప్రసాద్‌తో, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి 10వ తరగతి విద్యార్థులు పాస్ అవటానికి కావాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

# గూడు లేక గిరిజనుల గోడు

- ఊరికి దూరాన ఉంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులు
- అధికారులకు అర్జీ రూపంలో తమ గోడును వెల్లబోస్తున్న గిరి పుత్రులు
- అర్జీ చూపి వెంటనే సమస్య తీర్చాలంటూ సీపీఐ డిమాండ్



**పుల్లలచెరువు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

ఎంతో కాలం నుంచి తల దాచుకోవడానికి గూడులేక ఊరికి దూరాన అడవి ప్రాంతాన చాలీ చాలని కూలీలతో జీవనం సాగిస్తున్న గిరిజనుల గోడు తీర్చే నాథుడు ఎవరు, రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితులలో బతుకుబండిని ముందుకు నెట్టుకు పోతున్న పరిస్థితి. ఇది ఎక్కడో కాదండోయ్ పుల్లలచెరువు మండలంలోని చిన్న పీఆర్సీ తండి గిరిజనులకు నిలువ నీడ కోసం ఇంటి స్థలాలు మంజూరు చేయాలని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డికి అర్జీ అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమం చిన్న పీఆర్సీ తండా వాసులు భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మండల కార్యదర్శి జి.గురునాథం నాయకత్వంలో నిర్వహించారు. చిన్న పీఆర్సీ తండా సీపీఐ దేవసోత్తు మంత్రు నాయక్, సీపీఐ కార్యదర్శి జీవీ గురునాథం మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా నివాసముంటున్నప్పటికి మా గ్రామ ప్రజలకు ఇంటి స్థలాలు లేక సరైన ఇల్లు లేక పూరి గుడిసెల్లో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ దుర్భార జీవితాలు గడుపుతున్నామని ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. రెండు సంవత్సరాల నుండి జిల్లా కలెక్టర్‌కి విన్నవించుకున్నప్పటికి ఎలాంటి ఫలితం లేదని ఇప్పుడైనా ప్రభుత్వం స్పందించి మా బాధలు గుర్తించే మాకు నివాసయోగ్యమైన ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, నిలువ నీడలేని మాకు ప్రభుత్వం బిల్డింగ్‌లు నిర్మించి ఇవ్వాలని ఆయన అన్నారు. అదే విధంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పూర్ణకంటి తిరుమలయ్య మాట్లాడుతూ చిన్న పీఆర్సీ తండా నివాసులకు ఇంటి స్థలాలు వెంటనే మంజూరు చేసి ప్రభుత్వమే వాళ్లకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, దళిత హక్కుల పోరాట సమితి డిమాండ్ చేయడం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

**స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి :**

అర్జీ అందుకున్న వెంటనే డిప్యూటీ తహసీల్దార్ స్పందించి మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో మీ సమస్యను పరిష్కరిస్తామని 10వ తేదీ గ్రామాన్ని సందర్శించి అర్హులైన వారికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న పీఆర్సీ తండా నివాసులు బాణావత్ మేగ్లీ బాయి, భారతి బాయి, పీకే ఆయి, ఆత్మా నాయక్, వస్త్రం నాయక్, హనుమాన్ నాయక్, చిన్న పీఆర్సీ తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన రైతుల విజ్ఞాన యాత్ర

**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

ఉద్యాన శాఖ, మార్కాపురం జిల్లా వారు కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలలోని ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులను అనంతపురం జిల్లాలో ఆధునిక పద్ధతిలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతుల తోటల సందర్శనకు ఫిబ్రవరి 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు తీసుకుని వెళ్ళడం జరుగుతుందని కనిగిరి ఉద్యానశాఖ అధికారి పి.విష్ణుప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యాన రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉద్యాన పంటల సాగు విధానంపై క్షేత్ర స్థాయి అవగాహనలో భాగంగా ఆధునిక సాగు పద్ధతులు, నాణ్యమైన నాటే పద్ధతులు ఎంపిక ఎరువుల వినియోగం నీటి నిర్వహణ, తెగుళ్ల రోగాలు నియంత్రణ కోత అనంతరం నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించుట కొరకు క్షేత్ర స్థాయినే ప్రదర్శన ద్వారా రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలు , సబ్సిడీలు, మార్కెట్ అవకాశాల గురించి ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని కనిగిరి ఉద్యానశాఖ అధికారి పి.విష్ణుప్రియ తెలియజేశారు.

# వ్యవసాయ రాయితీలపై అవగాహన కలిగి ఉండాలి



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలంలోని చిన్న దోర్నాల క్లస్టర్ గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం 2025-26 ఆర్‌కేవీవై -ఆర్ఏడీ పథకం కింద రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో యర్రగొండపాలెం సహాయ వ్యవసాయ సంచాలకులు ఈ వెంకటరమణ మాట్లాడుతూ రైతులకు వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం యొక్క విధి విధానాల గురించి అలాగే ఈ పథకంలో సమగ్ర సుస్థిర వ్యవసాయం ద్వారా రైతులు వారి యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కుటుంబానికి 30వేల రూపాయలు వరకు ఈ పథకం కింద రాయితీస్తుందని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకంలో వ్యవసాయ పంటలలో భాగంగా పప్పు జాతి పంటలు, చిరుధాన్యాలు, పశుగ్రాసం, నూనె గింజ పంటలు, అలాగే ఉద్యాన పంటలు లేక పశువుల పెంపకం కోళ్ల పెంపకం మేకల పెంపకం గొర్రెల పెంపకం ఈ మూడింటిలో రెండు పథకాలు పాటించిన రైతులకు అలాగే సేంద్రియ వ్యవసాయం కింద వర్మీ కంపోస్టు యూనిట్స్ తేనెటీగల పెంపకం, సైలేజి, చేపల పెంపకం ఈ నాలుగింటిలో రెండు యాక్టివిటీస్ చేసిన రైతులకు ఒక రైతు కుటుంబానికి 30 వేల రూపాయలు రాయితీస్తుందని తెలిపారు. కాబట్టి రైతులు తప్పనిసరిగా ఈ పథకాన్ని ఉపయోగించుకుని వారి యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాల్సిందిగా అలాగే సుస్థిర వ్యవసాయంలో సంవత్సరం పొడవునా రైతులకు ఆదాయం కల్పించే విధంగా ఈ పథకం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు డి.పార్వతి, ఎం.రాజేంద్ర ప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, చిన్నదోర్నాల క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

# వాట్సప్ మేసేజ్‌లకు పెట్టుబడులు పెడుతున్నారా..?

## - ప్రజలారా జర జాగ్రత్త.. పోలీసుల సూచనలు



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

వాట్సప్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పెట్టుబడి సందేశాలను నమ్మి పలువురు మోసాలకు గురవుతున్నారని, వాట్సప్ మెసేజ్‌లకు పెట్టుబడులు పెడుతున్నారా ప్రజలారా జర జాగ్రత్తని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీసులు సూచనలతో హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు దోర్నాల ఎస్సై ఎస్.వెంకట రమణయ్య మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు, రోజుకు ఇంత లాభం వస్తుంది, షేక్ మార్కెట్ పెట్టుబడులతో కోట్ల ఆదాయం వంటి ఆకర్షణీయ ప్రకటనలతో సైబర్ నేరగాళ్లు ప్రజలను వలలో పడేస్తున్నారని పేర్కొన్నారు. మొదట చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టించి, నమ్మకం కలిగించేలా కొంత లాభం చూపించి, తర్వాత పెద్ద మొత్తాలు డిపాజిట్ చేయించుకుని అకస్మాత్తుగా ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయడం, గ్రూపులో నుంచి తొలగించడం ద్వారా మోసాలు చేస్తున్నారని, ప్రజలు అటువంటి మెసేజ్‌లు నమ్మవద్దని ఎస్సై వెంకట రమణయ్య తెలిపారు. ఇలాంటి పెట్టుబడి సందేశాలు బ్యాంకులు లేదా ప్రభుత్వ సంస్థల ద్వారా కాకుండా వ్యక్తిగత నంబర్లు, అనుమానస్పద లింకులు ద్వారా వస్తాయని వాటిని ఎట్టి పరిస్థితులలో నమ్మవద్దని సూచించారు. గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయడం, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, ఏటీఎం నెంబర్లు షేర్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. పెట్టుబడుల విషయంలో జాగ్రత్త, తెలియని వాట్సప్ గ్రూపులలో జాయిన్ అవ్వద్దు, వాట్సప్ గ్రూపుల్లో వచ్చే ఇన్వెస్ట్‌మెంట్ టిప్స్ నమ్మొద్దు, ఈజీ మనీ ఆశతో ఎలాంటి లింక్స్ క్లిక్ చేయొద్దు, వాట్సప్ గ్రూపుల్లో వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్లోడ్ చేయకండి, అపరిచితుల మాటలు నమ్మి డబ్బులు ఇవ్వకండి, పెట్టుబడులపై అపరిచితులతో చర్చించకండి, మీరు సైబర్ క్రైమ్ బాధితులు అయితే 1930 కి కాల్ చేయండి. లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్‌ని సంప్రదించండని ఎస్సై ఎస్.వెంకటరమణయ్య వివరించారు. సులభ లాభాల పేరుతో వచ్చే మెసేజ్‌లను నమ్మకండి జాగ్రత్తలే రక్ష అని తెలిపారు.

# సేద్యపు భూముల్లో మట్టి నమూనాల సేకరణ



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి5, ప్రభాతవార్త**

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సిబ్బంది సేద్యపు భూముల్లో మట్టి నమూనాలను సేకరించారు. ఈ మేరకు గురువారం దోర్నాల యూనిట్ అయినముక్కల, హసనబాద్ గ్రామాలలో కర్ర రాములు యూనిట్ సాయిల్ శాంపిల్స్ సేకరించారు. మట్టిలోని పోషక విలువలు, సారవంతం, తేమ స్థాయి తదితర అంశాలపై సేకరించిన మట్టి నమూనాలను ప్రయోగశాలలకు పంపుతామని తెలిపారు. అక్కడ నుండి వచ్చిన నివేదికల ఆధారంగా ఆయా భూములకు అనుకూలమైన పంటల ఎంపిక, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఉపయోగించాల్సిన జీవ ఎరువులు, ద్రావణాలు, సాగు విధానాలపై రైతులకు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రసాయనిక ఎరువులు తగ్గించి, మట్టికి హానీ కలగకుండా సేద్యం చేయడం, పంట దిగుబడులు పెంచడం, రైతులు ఆదాయం పెంచుకోవడానికి చైతన్య పరుస్తామని వారు తెలిపారు. ఈ మట్టి సేకరణ కార్యక్రమంలో రైతులు యేసయ్య, రూతమ్మ, యూనిట్ ఇన్‌చార్జి కర్ర రాములు, ఐసీఆర్‌పీఎస్ వెన్న సుబ్బారెడ్డి, బట్టు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాలుట్ల గ్రామానికి విద్యుత్‌శాఖ మంత్రితో పాటు తెలుగుదేశం పార్టీ అతిరధ మహారధుల రాక



**యర్రగొండపాలెం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం మండలం అటవీ ప్రాంతంలోని గ్రామమైన పాలుట్లలో నిర్మిస్తున్న అప్‌గ్రిడ్ సోలార్ హోమ్ వెలుగుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని అతిరధమహారధులు రావాల్సిందిగా యర్రగొండపాలెం నియోజకవర్గ బాధ్యులు ఎరిక్షన్‌బాబు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఫిబ్రవరి 6వ తేదీన అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నలమల అటవీ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు తొలి అడుగు పడిందని, ఎళ్ళ తరబడి విద్యుత్ వెలుగులు చూడని అటవీలోని గ్రామమైన పాలుట్ల గ్రామానికి 3 కోట్ల వ్యయంతో 611 గిరిజన కుటుంబాలకు అప్‌గ్రిడ్ సోలార్ హోమ్ లైటింగ్ సిస్టం ద్వారా గిరిజన గూడేలు వెలుగులు చూడబోతున్నాయని గిరిజన గూడాల్లో వెలుగులు నింపే చారిత్రాత్మకమైన అడుగులు పడబోతున్నాయని తెలుగుదేశం పార్టీ చెబుతుంది. అటవీ గ్రామంలో సాయంత్రం వేళ జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లతో పాటు గిద్దలూరు ఎమ్మెల్యే, ముత్తుముల, కనిగిరి శాసనసభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబులతో పాటు తదితర నేతలు తరలి వస్తున్నారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.

# అమరావతి తరలివెళ్ళిన నీటి సంఘం అధ్యక్షులు



**వెలిగండ్ల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

రాష్ట్ర రాజధాని అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగే నీరు, ప్రగతి, జలహారతి, సాగునీటి సంఘాల భాగస్వామ్యం సమావేశానికి వెలిగండ్ల మండలంలోని నీటి సంఘాల అధ్యక్షులు గురువారం తరలి వెళ్లారు. సమావేశానికి తరలి వెళ్లేందుకు తహసీల్దార్ ఎన్.వాసు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడిచెరువు నీటి సంఘం అధ్యక్షులు ముక్కు వెంకట శ్రీరాములురెడ్డి, పందువగండి రిజర్వాయర్ చైర్మన్ ముక్కు వెంకటేశ్వరరెడ్డి, మహేష్‌రెడ్డి,తదితర నీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు బయలుదేరి వెళ్లారు.

# విద్యుత్ కార్మిక సంఘం డైరీ ఆవిష్కరణ



**వెలిగండ్ల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మరపగుంట్ల గ్రామంలోని ఇంద్రభూపాల్‌రెడ్డి నివాసంలో విద్యుత్ ఉద్యోగుల సమక్షంలో నూతన డైరీని ఆవిష్కరించడం జరిగింది. డైరీ ఆవిష్కరణ అనంతరం ఇంద్రభూపాల్‌రెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డిని విద్యుత్ ఉద్యోగులు ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం విద్యుత్ ఉద్యోగుల సమస్యల గురించి అడిగి తెలుసుకుని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కనిగిరి నియోజకవర్గ తెలుగు నాడు విద్యుత్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కంటి పరీక్షలుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

## - కోర్టు ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



**సింగరాయకొండ, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ వి. లీలా శ్యాంసుందరి సూచించారు. సింగరాయకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలుకు చెందిన జిమ్స్ కంటి హాస్పిటల్ సహకారంతో స్థానిక కోర్టు ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి డాక్టర్ వి. లీలా శ్యాంసుందరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది నిత్యం పుస్తకాలు, ఫైళ్లతో పని చేయడం వల్ల కళ్లపై ఒత్తిడి పెరుగుతుందని, అందువల్ల క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు మాట్లాడుతూ, న్యాయ సేవలతో పాటు సామాజిక సేవల్లోనూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులోనూ ఆరోగ్య శిబిరాలను నిర్వహించేందుకు బార్ అసోసియేషన్ కట్టుబడి ఉందన్నారు.జిమ్స్ కంటి హాస్పిటల్‌కు చెందిన వైద్యనిపుణుల బృందం శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు అందించడంతో పాటు కళ్లద్దాలపై సలహాలు ఇచ్చింది. శస్త్రచికిత్స అవసరమైన వారికి తదుపరి చికిత్సకు మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిమ్స్ డాక్టర్ నరసింహారావు, పీఆర్ఓ రమణ,మసూద్ ఆలీ, సుభాకర్, బార్ అసోసియేషన్ సభ్యులు,న్యాయవాదులు,కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.

# పశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

## - లేగదూడల ప్రదర్శన - డాక్టర్ మురళీకృష్ణ



**లింగసముద్రం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ,రాష్ట్రీయ గోకుల్‌మిషన్ ఆర్థిక సహకారంతో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పశుగణాభివృద్ధి ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ మురళీకృష్ణ హాజరై మాట్లాడుతూ పశుసంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఏడాదికి ఒక దూడ, ఎస్ఎస్ఎస్ సమీకృత ఆహారం గురించి రైతులకు వివరించారు. అనంతరం వీవీపాలెం సహాయ సంచాలకులు డాక్టర్ చెన్నకేశవులు, లింగసముద్రం పశువైద్యాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం,ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రైతులకు ఖనిజ లవణ మిశ్రమ దిమ్మెలు,బి కాంప్లెక్స్ మందులు, మూడు దూడల రైతులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొగిలిచర్ల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రమణయ్య, ఏహెచ్‌లుచౌదయ్య,పాండు రంగారావు, కిరణ్, రమేష్, వినోద్, శ్రీను సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పరిపాలన చూసి ఓర్వలేకనే

- కులాల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ
- తిరుపతి లడ్డు విషయాన్ని పక్కదారి పట్టించేందుకే అంబటి ఏపిసోడ్
- జనసేన పార్టీ ఐటీ కోఆర్డినేటర్ బింక నరేంద్ర



**లింగసముద్రం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలతో కూడిన పరిపాలన నడుస్తుంటే ఓర్వలేక.. గతంలో తాము చేసిన ఘోరాలు బయటకు వస్తుంటే జగన్ భయపడి తప్పుడు రాజకీయాలకు సిద్ధపడుతున్నాడని కందుకూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఐటీ కోఆర్డినేటర్ బికం నరేంద్ర ఒక ప్రకటనలో విమర్శించారు. కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతున్నాడు. తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి విషయాన్ని పక్క దారి పట్టించేందుకే ఇలాంటి తప్పుడు కార్యక్రమాలను ముందుకు తీసుకొచ్చారు తప్ప మరొకటి కాదన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడారు అనేది ముమ్మాటికి నిజమని సిట్ నివేదిక స్పష్టంగా చెబుతున్నా ఇంకా బుకాయిస్తున్నారని అన్నారు. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టులో జంతు కొవ్వు ఆనవాళ్ళు ఉన్నాయని చెప్పారు. ఆ విషయం బయటకు వచ్చాక ప్రభుత్వం విచారణ చేపట్టింది. విచారణలో కూడా కల్తీ నెయ్యి వాడారు అని తేలింది. ప్రభుత్వం ఖచ్చితంగా దోషులను చట్టం ముందు నిలబెడుతుందని దాన్ని డైవర్ట్ చేసేందుకే అంబటి రాంబాబును జగన్ ఒక పావుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. సీబీఐ మాక్ క్లీన్ చిట్ ఇచ్చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి అంటూ జగన్ గోల చేస్తున్నారు. ఎక్కడ క్లీన్ చిట్ ఇచ్చిందో చూపించాలని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేలా ఒక ఫ్లెక్సీ వేయగానే గగ్గోలుపెడుతున్నారు అంటే వీళ్ళకు భయం ఏ స్థాయిలో పుట్టిందో జనానికి అర్థమవుతుందని అన్నారు. ఫ్లెక్సీ వేస్తే గోల చేస్తున్న జగన్ వైసీపీ సిద్ధం సభల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పోలిన బొమ్మలు పెట్టి వాటిని వైసీపీ గంజాయి బ్యాచ్‌తో కొట్టించి, కాళ్లతో తన్నించినప్పుడు ఏమైందో నీ సంస్కారం, మీ విలువలు, అప్పుడు రాక్షసానందం పొందింది జగన్ కాదా అని అన్నారు. ఆ ఫ్లెక్సిలో వాస్తవాలు ప్రజలకి చెప్పేలా ఉండటంతో జగన్ అర్జెంట్‌గా సంస్కారం గుర్తుకు వచ్చింది. అంబటి రాంబాబు తిట్టినవి తిట్లే కాదు, అవి బూతులే కాదు అంటూజగన్ సర్టిఫికేట్ ఇస్తున్నాడు అంటే అతను మానసికంగా ఎంత దిగజారిపోయాడో స్పష్టంగా తెలుస్తుందన్నారు. జగన్‌కి బూతులు అంటే మహా ఇష్టం అవే పవిత్ర వాక్యాలు మాదిరి వినిపిస్తాయి. అంబటి రాంబాబు, కొడాలి నాని, జోగి రమేష్, వంశీ, పేర్ని నాని వాడే బూతులు ఆయనకు వినసొంపుగా ఉంటాయన్నారు. జగన్ దిగజారుడు తనం ఏ స్థాయిలో ఉంటుందంటే ఆయన తన సొంత చెల్లెలు పసుపు చీర ధరిస్తే కూడా ఓర్చుకోలేక అవాకులు చెవాకులు మాట్లాడించి అతని రోత మీడియాలో చెండాలపు రాతలు రాయించాడని అలాంటి నీచ మనస్తత్వం ఉన్న వ్యక్తికి సభ్య సమాజంలో తిరిగే అర్హత లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా చట్టబద్ధమైన పాలన చేస్తోంది. ప్రజల మధ్య విభేధాలు సృష్టించేలా కుట్రపూరిత రాజకీయాలు చేసేవారిని కట్టడి చేస్తుందని, మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి, ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలి, మన యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెంచాలి, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మౌలిక వసతులు కల్పించాలి అనే దిశగానే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ముందుకు వెళ్తున్నారని అన్నారు. జగన్ అరాచకంతో ముందుకు వెళ్లాలి అనుకుంటే ఖచ్చితంగా అడ్డుకుంటాము, ఆయనకు మాదిరి ఆటవిక పాలన చేయడం మా కూటమి ప్రభుత్వానికి తెలియదన్నారు.

### క్షేత్ర మిత్ర బృందం పొగాకు తోటలు, క్యూరింగ్ గ్రేడింగ్‌ల పరిశీలన



**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

2025-26పంటకాలానికి పొగాకు బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఒంగోలు, కందుకూరు-2 పొగాకు బోర్డు వేలం కేంద్రం ఆధ్వర్యంలో పొగాకు కంపెనీల ప్రతినిధులతో కలిసి క్షేత్ర మిత్ర బృందంగా ఏర్పడి కందుకూరు పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలోని గ్రామాలలో పర్యటించి పొగాకు రైతులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను తెలుసుకుని తగు సలహాలు సూచనలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా బోర్డు అధికారులు, కంపెనీ ప్రతినిధులు రామచంద్రపురం, వలేటివరిపాలెం, పోలినేనిపాలెం గ్రామాల రైతులతో కలిసి పొగాకు తోటలను, బ్యారెన్‌లు, క్యూరింగ్‌లు గ్రేడింగ్‌లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వేలంనిర్వహణాధికారి పొగాకురైతులకు పొగాకుసాగులో తీసుకోవాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులను వివరించారు.పక్వానికి వచ్చిన ఆకులు మాత్రమే రెలుపులు చేయాలి,ఇంకా క్యూరింగ్ చేయనప్పుడు తగిన సంఖ్యలో మాత్రమే పొగాకు కర్రలను బ్యారెన్‌లో ఎక్కించాలని, బ్యారెన్‌లు అగ్నిప్రమాదాలు జరగకుండా గొట్టములపై ఇనుప జల్లడలను ఏర్పాటు చేసికొనవలెనని, క్యూరింగ్ వారీగా మండేలు వేసుకొనవలెనని, మండెలను నాణ్యత దెబ్బతినకుండ తిరగవేసుకోవాలని, క్యూరింగ్ చేయనప్పుడు బ్యారన్‌లో క్యూరోమీటర్ అమర్చుట ద్వారా ఉష్ణోగ్రతలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పొగాకు రంటు కాపాడుకోవచ్చునని తెలిపారు. బ్యారన్‌లో క్యూరింగ్ చేసేటప్పుడు అగ్ని ప్రమాదం జరిగితే ఆలస్యం కాకుండా పొగాకు బోర్డుకు తెలియజేస్తే మేము ఇన్సూరెన్స్ వాళ్లకు తెలియపరుస్తాము, టార్పాలిన్ పట్టలను వాడుట ద్వారా క్షేత్రస్థాయిలో పొగాకేతర అన్యపదార్థాలను కలవకుండా నివారించవచ్చని తెలిపారు. పొగాకు రైతులు అందరూ మంచిగా గ్రేడింగ్ చేసేటప్పుడు అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ చేయించుకునే వాళ్ళు బోర్డుదగ్గరికి వచ్చి బోర్డు క్షేత్ర సహాయాధికారి బోర్డు క్షేత్రాధికారికి తెలియపరిచి అనుమతి తీసుకోవలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు పొలాల మధ్య క్యూరింగ్, గ్రేడింగ్‌లు పరిశీలించి తగు సూచనలు, జాగ్రత్తలను తీసుకోవాల్సిందిగా రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.రామారావు ప్రాంతీయ అధికారి ఒంగోలు కే.రాజగోపాల్, ఉన్నం శ్రీనివాసులు జీపీఐ మేనేజర్, ఐటీసీ మేనేజర్ ఎం.వెంకటరావు, మేనేజర్ రామాంజనేయులు, పొగాకు బోర్డుసిబ్బంది, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# లింగసముద్రం నూతన ఎస్సైగా రాంబాబు



**లింగసముద్రం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

లింగసముద్రం నూతన ఎస్సైగా రాంబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. లింగసముద్రం పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. వినుకొండ ఎస్సైగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి రావడం జరిగింది. ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న నారాయణ సెలవుపై వెళ్లడంతో ఈ నియామకం జరిగింది.

### ఎమ్మార్పీఎస్ నాయకుడిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



కర్నూల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుడినీ హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పీటర్ మాదిగ డిమాండ్ చేశారు. మార్కాపురం జిల్లా కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం జాయింట్ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జయరాజ్ మాదిగ, దారువేముల రమేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

### మార్కాపురం రూరల్ నూతన ఎస్సైగా ఉన్నం వేమన

**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**




మార్కాపురం రూరల్ నూతనఎస్సైగా ఉన్నంవేమన నియమితులయ్యారు. ఈయన గతంలో పొదిలి ఎస్సైగా పని చేశారు. ప్రస్తుతం రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న అంకమ్మ రావును జిల్లా ఎస్ పి కార్యాలయానికి రిపోర్ట్ చేశారు.

## కాశీనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపిన నూతన ధర్మకర్తలు

**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ కార్యాలయం నందు పురాతనమైన, ప్రసిద్ధి గాంచిన మార్కాపురం శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవస్థాన కమిటీ ధర్మకర్తలుగా జనసేన పార్టీ తరుపున ఎన్నికైన విజయరావు నరసింహారావు మరియు మండ్ల వెంకటయ్య జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ ఇమ్మడి కాశీనాథ్‌ను గురువారం పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ ధర్మకర్తలుగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవస్థాన అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మరియు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పిన్నెబోయిన శ్రీనివాసులు, బెల్లంకొండ గోపి, కంబం వెంకట రమణ, బట్టగిరి మురళీధర్ రెడ్డి, షేక్ అన్ను, ప్రసాద్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, రీ సర్వేలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు

**- మండల సర్వేయర్, వీఆర్వోలకు ఛార్జ్ మెమో జారీ చేసిన జేసీ కల్పనా కుమారి**

**- మద్దిపాడులో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీలో జేసీ కల్పనా కుమారి**

**సంతనూతలపాడు(మద్దిపాడు), ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



రైతులకు సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, రీ సర్వేలో ఎలాంటి అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి హెచ్చరించారు. మద్దిపాడు సచివాలయంలో గురువారం జరిగిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మీ అధ్యక్షత వహించారు. రీ సర్వేకు ముందు మద్దిపాడులో తమకు చెందిన భూమి పట్టా భూమిగా ఉండగా రీ సర్వే తదుపరి గ్రామ కంఠంగా ఆన్‌లైన్లో నమోదైందని రైతు నాగేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రీ సర్వేకు ముందు తదుపరి పొలాలు విస్తీర్ణాలు కూడా హెచ్చు తగ్గులుగా ఉంటున్నాయని, పట్టాదారు పాస్ పుస్తకాల్లో కూడా ఇదే విధంగా ఉంటున్నట్టు పలువురు రైతులు ఈ సందర్భంగా వాపోయారు. దీనిపై జాయింట్ కలెక్టర్ ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మీ, మండల సర్వేయర్ నిజాం, వీఆర్వో సుధాకర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందు నిమిత్తం వీఆర్వో, మండల సర్వేయర్‌కు చార్జిమెమోకు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆదేశించారు. తదుపరి రైతులకు జేసీ కల్పనా కుమారి, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మీ, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. రెవెన్యూకు సంబంధించి ఎటువంటి అవకతవకలు జరిగిన కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారులు సహకార సమైక్య అధ్యక్షులు మండవ జయంతిబాబు,మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదాల నివారణకు పది ప్రాంతాలను పరిశీలించిన పలు శాఖల అధికారుల బృందం

**సంతనూతలపాడు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలంలో గురువారం నాడు ప్రమాదాల నివారణకు పోలీసు, ఆర్టీసీ రవాణా శాఖ అధికారుల బృందం ఒంగోలు కర్నూలు ఆర్‌అండ్‌బి, రహదారిలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను గుర్తించారు. ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలను అధికారుల బృందం సమీక్షించారు. తదుపరి చీమకుర్తిలో ఈ బృందం ప్రమాదాల నివారణకు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారిణి సుశీల, జిల్లా ఆర్టీసీ ఆర్ఎం జి.సత్యనారాయణ, చీమకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాసరి ప్రసాదు, సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, సంతనూతలపాడు వీఆర్వో వెంకట స్వామి, పోలీసు సిబ్బంది, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మహిళలుచట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**సీఎస్‌పురం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**




మహిళా చట్టాలపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండేలా చూడాలని ఎస్సై ఎం.వెంకటేశ్వర నాయక్ వెలుగు వీఓఏ, ఇసి సభ్యులకు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఏపీఎం లక్ష్మీ నారాయణ అధ్యక్షతన మహిళా చట్టాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, లింగ వివక్ష రూపమాపడం బాల్య వివాహాలు నిరోధించడంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికలు తమ హక్కులను తెలుసుకుని ఉన్నత విద్య దిశగా ముందుకు సాగాలన్నారు. అనుచిత వ్యక్తుల ఫోన్లు, ఫేస్‌బుక్, ఇతర మాధ్యమాల్లో సంభాషణలు, ఫొటోలు పంపడం, గ్రూపుల్లో పెట్టడం వంటి కలాపాలకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు ఎంతో అనర్థదాయకమని, పురుషులకు 21 సంవత్సరాలు, మహిళలకు 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలని సూచించారు. బడి ఈడు పిల్లలందరిని విధిగా పాఠశాలకు పంపాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగినట్లయితే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి వీటిపై అవగాహన చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు, వీఏఓ, ఈసీ సీసీలు పాల్గొన్నారు.

### బైరవకోన, మిట్టపాలెంలో మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

**సీఎస్‌పురం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**





ప్రముఖ పుణ్యక్షేత్రం,పర్యాటక ప్రాంతం మండలంలోని బైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి క్షేత్రాల్లో ఈనెల 15వ తేదీ ఆదివారం మహాశివరాత్రి వేడుకలకు చేస్తున్న ఏర్పాట్ల పనులను గురువారం దేవాదాయ ధర్మదాయశాఖ ప్రకాశం జిల్లా ఏసీ ఎం.పానకాలరావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీఎం.పానకాలరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఏసీ పానకాలరావు మాట్లాడుతూ భక్తులకు ఎక్కడా తాగునీటి ఇబ్బందులు, క్యూలైన్‌లలో ఇబ్బందులు,వాహన పార్కింగ్ సమస్యలు , ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా భక్తులకు అన్న ప్రసాదం అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై ఈఓ చర్చించి పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బైరవకోన ఆలయ చైర్మన్ ముప్పాళ్ల శ్యామ్ సుందర్‌రాజు,సూపరింటెండెంట్ జి.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జీపి సత్యనారాయణ, చైతన్య, ఈవో గిరిరాజు నరసింహులు, డి.వంశీకృష్ణారెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు ఉన్నారు.

## గ్రీన్ అంబాసిడర్స్‌కి నెలకు రూ.10వేలు వేతనం ఇవ్వాలి

**దర్శి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్మికులుగా పనులు చేస్తున్న గ్రీన్ అంబాసీడర్స్ కార్మికులకు 2020 లో ప్రభుత్వం ఇచ్చిన 10 వేలు నెలకు వేతనం జీవోని అమలు చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు అన్నారు. గురువారం దర్శి మండలంరాజంపల్లి,కొత్తపల్లి,కొర్లమడుగు, రామచంద్రాపురం,వెంకటాపురం, గ్రామంలో ఫిబ్రవరి 12వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెని జయప్రదం చేయాలని జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్మికులను 2017లో నియమించి వారి సమస్యలు పట్టించుకోలేదన్నారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు గుంటు బాలగురవయ్య, తిరుపతయ్య, అనోక్, ఇస్సాక్, విశ్రాంతమ్మ,అంజమ్మ, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

### తురిమెళ్ళలో అధికార లాంఛనాలతో ఆర్మీజవాన్ వెంకటరమణ అంత్యక్రియలు





**కంభం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**



కంభం మండలం తురిమెళ్ళ గ్రామంలో గురువారం ఆర్మీ జవాన్ యేలం వెంకటరమణ (49) అంత్యక్రియలు గ్రామస్తులు, కుటుంబ సభ్యుల అధికార లాంఛనాలతో ఘనంగా జరిగాయి. అస్సాం రాష్ట్రం దిబ్రూగఢ్‌లో విధుల్లో ఉన్న వెంకటరమణకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. లెఫ్టినెంట్ హోదాలో ఉన్న వెంకటరమణ బుధవారం పదవీ విరమణ చేయాల్సి ఉండగా ముందు రోజు మంగళవారం మరణించడంతో కుటుంబ సభ్యులు, ఆర్మీఅధికారులు, తోటి సైనికులనందరిని కలిచివేసింది. కాగా అస్సాం నుంచి వెంకటరమణ పార్థివ దేహాన్ని గురువారం స్వగ్రామమైన కంభం మండలం తురిమెళ్ళకు తీసుకురావడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులు, మరియు తాసిల్దార్ కిరణ్, ఎస్ఐ శివకృష్ణారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మిలు వెంకటరమణకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మేజర్ ఎస్‌వి సింగ్ ఆధ్వర్యంలో సైనిక వందనం అనంతరం సంతాప సూచకంగా గాలిలో కాల్పులు జరిపిన అనంతరం అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

### గ్రామ ఆరోగ్య క్లినిక్ నిర్మాణానికి 10 సెంట్లు భూమి దానం

**మార్కాపురం, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త**



మార్కాపురం జిల్లా మార్కాపురం మండలం భూపతిపల్లి గ్రామంలో గ్రామ ఆరోగ్య క్లినిక్ నిర్మాణం కొరకు ఆ గ్రామానికి చెందిన కుందూరు శివకుమారి (భర్త: శ్రీనివాసరెడ్డి) తమ స్వంత పట్టా భూమిలోని 10 (పది)సెంట్ల భూమిని ప్రభుత్వం వారికి విశాల హృదయంతో దానంగా అందజేశారు. చట్టపరమైన విధానాలను అనుసరించి, దానంగా ఇచ్చిన భూమిని రెవెన్యూ రికార్డులో గ్రామ ఆరోగ్య క్లినిక్‌గా మార్పు చేస్తూ సంబంధిత ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కె చిరంజీవి దాత కుందూరు శివకుమారి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమానికి దోహదపడే ఈ సేవా భావన ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

### మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- త్రిపురాంతకం ఉత్సవాలపై జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఆదేశాలు**

**మార్కాపురం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



త్రిపురాంతకంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మహాశివరాత్రి సందర్భంగా త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే ఉత్సవాల ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోప్రముఖమైన త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, త్రాగునీటి సౌకర్యం, బస్సు సదుపాయాలు, క్యూ లైన్‌లను సక్రమంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే భక్తుల భద్రతకు ప్రత్యేక కమాండ్ కంట్రోలర్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాట్లను సమర్థంగా పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని సమన్వయంతో పని చేయాలని సూచించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పి పానకాలరావు మాట్లాడుతూ త్రిపురాంతకేశ్వర స్వామి రథోత్సవానికి సుమారు 45 వేల నుంచి 50 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో ఉదయం 4 గంటల నుంచే అభిషేకాలు ప్రారంభమవుతాయని, బాలా త్రిపురసుందరి దేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు కూడా నిర్వహిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం రూ.10, రూ.100, రూ.250 దర్శన టికెట్లను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. అలాగే భోజన వసతి, మజ్జిగ ప్యాకెట్లు, చిన్నపిల్లలకు వేడి పాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ సబ్ కలెక్టర్ శివరాం రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక సౌకర్యాలు మెరుగుపరచాలి

**- జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు**

**మార్కాపురం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు తక్షణమే కల్పించాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని మరుగుదొడ్లను పరిశీలించి, వాటి నిర్వహణలో తీవ్ర లోపాలు ఉన్నాయని గుర్తించారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆర్టీసీ డిఎం లావణ్యకు స్పష్టంగా సూచించారు. అలాగే బస్టాండ్‌లో మరుగుదొడ్ల వినియోగానికి ప్రయాణికుల నుండి రూ.10 వసూలు చేస్తున్నారని ప్రయాణికులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, సంబంధిత సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి ఫిర్యాదులు వచ్చినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ఆర్టీసీ డిఎం లావణ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## జార్జ్ ఫార్మసీ కళాశాల సందర్శించిన జడ్‌పి విద్యార్థులు

**- వొకేషనల్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పోజర్ విజిట్ విజయవంతం**

**మార్కాపురం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



పుల్లలచెరువు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం మార్కాపురం పట్టణంలోని డా సామ్యుయేల్ జార్జ్ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (జార్జ్ ఫార్మసీ కళాశాల)ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రివొకేషనల్ ఎడ్యుకేషన్ ఎక్స్ పోజర్‌విజిట్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 6వ, 7వ, 8వ తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన కల్పించడం, భవిష్యత్‌లో వృత్తి అవకాశాలను గుర్తించేందుకు దోహదపడేలా ఈ ఎక్స్ పోజర్ విజిట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా డి ప్రసన్న కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రివొకేషనల్ విద్య ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని అన్నారు. చిన్న వయసులోనే ప్రాక్టికల్ అవగాహన పొందడం ద్వారా వారి ఆలోచనా శక్తి, వృత్తి దిశ స్పష్టంగా మారుతుందని పేర్కొన్నారు. ఇలాంటి సందర్శనలు భవిష్యత్ కెరీర్ ఎంపికలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అనంతరం కళాశాల బోధనా సిబ్బంది డా సునీత, డా అనుష,బి.శిరీషలు విద్యార్థులకు ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ ప్రాధాన్యతను వివరించారు. అలాగే ల్యాబొరేటరీలలో ఉపయోగించే వివిధ ఆధునిక పరికరాల వినియోగం గురించి ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పించారు. విద్యార్థులు సందేహాలు అడిగితెలుసుకుంటూ కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు .ఈఎక్స్‌పోజర్ విజిట్ ద్వారా విద్యార్థులకు వృత్తివిద్యపై స్పష్టత పెరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు.

## నాగులుప్పలపాడు పోలీసులు డబల్ ధమాకా..!

**- మహిళా పోలీసులు మిఠాయిలు పంపిణీ**

**- ఆ అధికారి బదిలీతో ఊపిరి పీల్చుకున్న పోలీసు సిబ్బంది..!**

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

శుభకార్యాలకు, పండుగలకు ఇంటిల్లిపాది ఆనందంగా ఉండే సందర్భాలు కోకొల్లలు. అధికారులు బదిలీపై వెళ్తే ఆ సిబ్బంది డబల్ ధమాకా సాధించిన అంతగా ఒకరినొకరు పరస్పరం చిరు హాస్య.. మిఠాయిలతో ఊపిరి పీల్చుకున్నట్టుగా కనిపిస్తుంది. ఈ సంఘటన నాగులుప్పలపాడు పోలీసు స్టేషన్ సిబ్బందితో పాటు సచివాలయ మహిళా సిబ్బందిలో స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ.. సిబ్బందిని, సచివాలయ మహిళా సిబ్బందిని ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టినట్లు కొందరు అధికారుల ఫిర్యాదులతో పాటు బాహాటంగానే ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికి ఆ అధికారిలో మార్పు రాకపోవడంతో మన కర్మ ఇంతే అని కాలం కోసం ఎదురుచూస్తున్న సందర్భంలో ఒక్క సారిగా ఆ సీఐ బదిలీ కావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. దాంతో పాటు స్థానిక ఎస్సై సెలవుపై వెళ్లడంతో మరింత ఆనందంతో సెలవులో ఉన్న సిబ్బంది కూడా తిరిగి బాధ్యతలు చేపట్టేందుకు క్యూలో వరుస పట్టారు. ఇప్పటికైనా అధికారులు క్రింది స్థాయి సిబ్బంది ఇబ్బందులను గమనించి వారి పట్ల సానుకూలతగా వ్యవహరించి మర్యాదపూర్వకంగా బాధ్యతలు నిర్వహించే విధంగా చేయించాల్సిన అవసరం పై అధికారులపై ఉందని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు ప్రజా ప్రతినిధులు ప్రత్యక్షంగా తెలియజేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో జింక మృతి

**సింగరాయకొండ, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త**



మండలంలోని శానంపూడి అడ్డరోడ్డు సమీపంలోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జింక అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సింగరాయకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని శానంపూడి అడ్డా రోడ్డు నుండి అర్ధరాత్రి సమయంలో జాతీయ రహదారి దాటుతున్న జింక ను గుర్తు తెలియని వాహనం డీకొని జింక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదాన్ని గస్తీ నిర్వహిస్తున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి సింగరాయకొండ ఎస్సై బి.మహేంద్రకు సమాచారం అందించారు.వెంటనే ఒంగోలు ఫారెస్ట్ బీట్ అధికారి శశిభూషణ్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.పోస్టుమార్టం నిమిత్తం జింకను పశుసంవర్ధన శాఖ ఆసుపత్రికి తరలించారు.వెటర్నరీ వైద్యులు హాజరత్తయ్య పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం జింకను ఫారెస్ట్ శాఖ అధికారులకు అప్పగించారు. ఫారెస్ట్ అధికారులు పంచనామా నిర్వహించి నిర్మానుష ప్రాంతంలో దహన సంస్కారాలు పూర్తి చేశారు.దాహం వేయడంతో నీటి కోసం అడవుల నుంచి బయటకు వచ్చే సమయంలో జింకలు వాహన ప్రమాదాలకు గురవుతున్నాయని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.ఈ ప్రాంతంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, పోలీసులు, పశుసంవర్ధన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పాకల బీచ్ ఫెస్టివల్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఆదేశాలు**

**సింగరాయకొండ, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త**





ప్రకాశం జిల్లాలో ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్‌ను అద్భుతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు.ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసుతో కలిసి సింగరాయకొండ మండలం,పాకల బీచ్‌ను సందర్శించారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణలో భాగంగా చేపట్టవలసిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశమై తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలో తొలిసారిగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పాకల బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పారిశుధ్య ఏర్పాట్లు, పార్కింగ్ నిర్వహణ, తాగునీటి వసతి, భద్రతా బందోబస్తు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగేలా క్రీడలు,మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, సాహస క్రీడలు, ఎగ్జిబిషన్, లేజర్ షోతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. అలాగే స్థానిక వంటకాలతో కూడిన ప్రత్యేక ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు.బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెండు రోజుల పాటు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.అవసరమైన మందులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతా బందోబస్తు పటిష్టంగా ఉండేలా పోలీసు అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీ చిరంజీవి, డీపీఓ వెంకటేశ్వర రావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీ వెంకటేశ్వర రావు, ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ శ్రీనివాస రావు,పర్యాటకశాఖ అధికారి శ్రీ రమ్య, డి.ఎస్.పి రాయపాటి శ్రీనివాసరావుతో పాటు వివిధ శాఖల మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించిన జడ్పి సిఈవో

**పొన్నలూరు,ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**





మండలంలోని పొన్నలూరు, ఇప్పగుంట,కె అగ్రహారం,రాజోలుపాడు, బోగనంపాడు పంచాయతీలలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను జడ్పీ సిఈవో బి. చిరంజీవి గురువారం పరిశీలించారు. ముందుగా పొన్నలూరు గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించారు.ఇప్పగుంట గ్రామపంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. గ్రామంలో ప్రతిరోజు ఇంటింటి నుండి చెత్త సేకరణ జరుగుతుందా అని గ్రామస్తులనుఅడిగి తెలుసుకున్నారు. ఇంటి నుండే తడి చెత్త , పొడిచెత్తని విడి విడిగా సేకరించాలని హరిత రాయబారులకు తెలిపారు. అదేవిధంగా 6000 మంది జనాభా కు ఆరుగురు క్లాప్ మిత్రాలు ఉండాలని, అవసరమైన చోటకొత్తవారిని నియమించుకోవాలని సూచించారు.అనంతరంకె.అగ్రహారం,రాజోలుపాడు, బోగనంపాడు గ్రామ పంచాయతీలను సందర్శించి పంచాయతీ కార్యదర్శులను శానిటేషన్, యుఎఫ్ఎ, అక్షర ఆంధ్ర గురించి సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ డాక్టర్ పి సుజాత ,డిప్యూటీ ఎంపీడీఓలు యు.సుబ్రహ్మణ్యం,వెంకటరావు, పంచాయతీ కార్యదర్శిఎం.భారతి,గీత,వెంకటేశ్వర్లునాయక్, నారాయణ,నాయకులు ఉన్నం కొండలరావు, నరసింగరావు,మారెళ్ళమాధవ, బోయపాటి రమణారెడ్డి, హరిత రాయబారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**రాచర్ల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాచర్ల ఏఎస్ఐ కె.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అనుములవీడు గ్రామంలో గురువారం ఆయన చెడువ్యసనాలు,మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పించారు.చెడు అలవాట్లకులోనై, మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలు పాడు చేసుకోవద్దని తెలిపారు. అనంతరం రంగారెడ్డిపల్లి హైవేలో వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న పలు వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రామచంద్ర, హోంగార్డులు రవూఫ్, రవికుమార్‌లు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి

**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**




మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని, కొత్తగా ప్రవేశపెట్టిన వీబీజీ రాంజీ స్కీంను తక్షణమే రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకానికి 40 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, పని గ్యారంటీ హక్కును రద్దు చేస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఈ రోజు వలేటివారిపాలెం ఎంపీడీవో శంకరరావు కు గురువారం వినతిపత్రంను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వలేటివారిపాలెం, ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ పాల్గొని మాట్లాడారు. కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశమైన చట్టాలను తెచ్చి పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి విబిజి రాంజీ పేరుతో కొత్త స్కీంని ప్రవేశపెట్టి గ్రామీణ ప్రజలకు హానీ కలిగిస్తుందని అన్నారు. ఈ పథకంలో కేంద్రం తనకు ఇచ్చిన రాష్ట్రాలకే నిధులు ఇచ్చుకునే విధంగా మార్పులు చేసింది. పని దినాల్లో కోత పెట్టింది. ఈ చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రాలు అప్పులు పాలవుతాయి. కొత్త పథకం వల్ల దేశంలో సామాజిక న్యాయం దెబ్బతిని దళితులు పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఇటీవల చేసిన కొన్ని సవరణలతో కూలీలకు పని కల్పించడం, కష్టమై, ఉపాధి హామీ పథకం నిర్వీర్యం అవుతుంది. కూలీల అవసరాలకు వీలుగా కాకుండా ప్రభుత్వానికి తోచిన సమయంలో పని చేసే విధంగా సవరణ పెట్టారని, దీని వలన పని చేసే కూలీలకు పని దొరకడం కష్టంగా మారుతుంది. పేదలకు అన్యాయం జరిగే ఈ కొత్త స్కీమ్‌ను రద్దు చేయాలని, పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వలేటివారిపాలెం మండల కార్యదర్శి మాదాల రమణయ్య, సీపీఎం నాయకులు సాధు చెన్నకేశవులు, జే.వెంకటేశ్వర్లు, జి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీలో జాక్టో ధర్నాలో పాల్గొన్న మండల ఉపాధ్యాయులు

**సీఎస్‌పురం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**




టెట్, సీపీఎస్ రద్దు కోరుతూ ఢిల్లీలోని జెంతర్ మంతర్ వద్ద ఏఐజాక్టో ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాల్లో మండల యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు. తమ డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కే.వెంకటేశ్వర్లు,డైరక్టర్ జవంగుళ వెంకటరావు, ఎస్టీయూ నాయకులు బైరెడ్డి వెంగళరెడ్డి పలువురు పాల్గొన్నారు.

8_8.qxd 2/5/2026 11:44 PM Page 1



## రాయలసీమ హక్కుల కోసం పోతిరెడ్డిపాడు వైపు దద్దాల దండయాత్ర



**కనిగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధనకు మద్దతుగా, రాయలసీమకు జరుగుతున్న అన్యాయాలకు నిరసనగా నంద్యాల జిలాలనందికొట్కూరు నియోజకవర్గంలోని పోతిరెడ్డిపాడు గ్రామం వద్ద నిర్వహిస్తున్న బహిరంగ సభకు కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాలనారాయణయాదవ్ పార్టీ నాయకులతో కలిసి గురువారం బయలుదేరి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి భారీగా నాయకులు, కార్యకర్తలతో దద్దాల నారాయణ యాదవ్ కనిగిరి నుంచి పయనమయ్యారు. దద్దాల వెం జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఒకేరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పులిశాంతి, సిరుప గోవర్ధన్ రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, అయిమెల్ల నాగమణి,మిట్టరమేష్‌రెడ్డి, రాచుటి, సుష్మిత,లక్ష్మీ,మడతల వెంకటేశ్వరరెడ్డి,బలసాని యోహోశివ,తదితర నాయకులు పాల్గొన్నారు. రాయలసీమకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో జరుగుతున్న ఈ బహిరంగ సభ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన కదిరి బాబురావు



**కనిగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై చంద్రబాబు ప్రభుత్వంవైఖరికి నిరసనగా గురువారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో పోతిరెడ్డిపాడు కార్యక్రమంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే,విశాఖపట్నం పార్లమెంట్‌పరిశీలకులు కదిరిబాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్గమధ్యలో నందికొట్కూరు సమీపంలో రాష్ట్ర రీజనల్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని కదిరి బాబురావు మర్యాదపూర్వకంగా కలిశారు. రాయలసీమకు సాగునీటి హక్కులు సాధించాల్సిన అవసరంపై నేతలు చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ చల్లామధుసూదన్‌రెడ్డి, సీఎస్‌పురంమండలవైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాలగుళ్ళ మల్లికార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, అనికాలపల్లి, ఉప్పలపాడు సర్పంచ్‌లు చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్,వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిద్ధు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల సాధనలో పార్టీ శ్రేణులు ఐక్యంగా పోరాడుతున్నాయని నేతలు పేర్కొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యా సామాగ్రి పంపిణీ



**కనిగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
భవిత కేంద్రంలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూలే బాలిరెడ్డి ఫంక్షన్ హాల్ అధినేత మూలే బాలిరెడ్డి విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, నోట్ బుక్స్, జామెట్రీ బాక్సులు, పలకలు తదితర అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ ఉడుముల వెంకట నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు ఇలాంటి సహాయాలు అందించడం అభినందనీయమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి.సంజీవి,దాత మూలే బాలిరెడ్డి, ఉపాధ్యాయులు పల్లా కోటిరత్నం, నరసింహారావు, భవిత సీఆర్పీలు ఎం.సైమన్, కే.గోపాలకృష్ణయ్య, ఎస్‌కే హబీబా తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడే ఇటువంటి కార్యక్రమాలు మరింత ప్రోత్సాహం పొందాలని పలువురు అభిప్రాయపడ్డారు.

## రూ.12.150 లక్షల డ్రైనేజీ పనుల పరిశీలన

**- 5వ వార్డులో చైర్మన్ అబ్దుల్ గఫార్ సందర్శన**



**కనిగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో కొనసాగుతున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ గురువారం పరిశీలించారు. మల్లిఖార్జున ఇంటి ప్రాంతం నుండి పవిత్ర ఫంక్షన్ హాల్ వరకు చేపట్టిన డ్రైన్ నిర్మాణ పనులను ఆయన ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. సుమారు రూ.12లక్షల 50 వేల వ్యయంతో నిర్వహించిన ఈ పనుల నాణ్యత, నిర్మాణ విధానం, నీటి పారుదల సౌకర్యాలపై అబ్దుల్ గఫార్ అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరువతో కనిగిరి ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు పటిష్టంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఈ కోటేశ్వరరావు కూడా పాల్గొని పనుల పురోగతిని వివరించారు. మున్సిపల్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు గఫార్ తెలిపారు.

### ఎమ్మెల్యే ఉగ్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి



**కనిగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఒంగోలు తెలుగుదేశం పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆర్కే గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ అధినేత, కనిగిరి తెలుగు యువత ఉపాధ్యక్షుడు పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవిస్తూ ప్రజా సేవలో పేదలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే చొరువ ప్రశంసనీయమని పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు.

## నేడు గ్రూపు-2 విజేతలకు ఎమ్మెల్యే ఉగ్ర సన్మానం



**కనిగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రూపు-2 పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు నేడు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్‌ఎల్‌ఎన్ హ్యాపీ హోమ్స్ ఎండీ కత్తులపల్లి వెంకటేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూపు-2 ఎంపిక జాబితాలో స్థానం పొందిన విజేతలను అభినందిస్తూ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరై విజేతలను ఘనంగా సత్కరించనున్నారు. కృషి, పట్టుదలతో సాధించిన ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తినివ్వాలని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉద్యోగులు, విలేకర్లు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఉద్యాన రైతులకు విజ్ఞాన యాత్ర

**- ఆధునిక సాగు పద్దతులపై ప్రత్యక్ష శిక్షణ**



**కనిగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
ఉద్యాన రైతుల ఆదాయం పెంపును లక్ష్యంగా పెట్టుకొని ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక విజ్ఞాన యాత్రను నిర్వహిస్తున్నట్లు కనిగిరి ఉద్యానవన శాఖ అధికారి పి.విష్ణు ప్రియ తెలిపారు. మార్కాపురం జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులను అనంతపురం జిల్లాలో ఆధునిక పద్దతుల్లో సాగు చేస్తున్న ఆదర్శ రైతుల తోటల సందర్శనకు ఫిబ్రవరి 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు తీసుకెళ్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ యాత్రలో భాగంగా రైతులకు క్షేత్ర స్థాయిలోనే ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా నాణ్యమైన నాటే పద్దతులు, సరైన ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, తెగుళ్లు- రోగాల నియంత్రణ, కోత అనంతర నిర్వహణ వంటి కీలక అంశాలపై శిక్షణ ఇవ్వబడుతుంది. అలాగే ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న సబ్సిడీలు, మార్కెట్ అవకాశాలు తదితర విషయాలపై కూడా రైతులకు సమగ్ర సమాచారం అందించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆధునిక సాంకేతికతను అవలంభించి అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని అధికారి సూచించారు.

### ఢిల్లీ పర్యటనలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ డాక్టర్ కడియాల లలిత్‌సాగర్



**దర్శి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రాత్రి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తేనేటి విందు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబుతో పాటు కలిసి పాల్గొన్న దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ఘనంగా వరసిద్ధి వినాయకుని ఆలయ వార్షికోత్సవం

**- సంకష్టహర చతుర్ధి సందర్భంగా ప్రత్యేక పూజలు**



**బల్లికురవ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన బల్లికురవలో వేంచేసియున్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయ రెండవ వార్షికోత్సవ ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సంకష్టహర చతుర్ధశి పర్వదినం కూడా కావటంతో మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మీ ముహూర్త సమయం నుండి స్వామివారికి పంచామృత అభిషేకాల అనంతరం, విశేష అలంకరణలు కొనసాగాయి. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ పూజారి ఇంకొల్లు సుధీర్ శర్మ మాట్లాడుతూ సంకష్టహర చతుర్ధశి ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి మాసంలోనూ కృష్ణపక్షంలో పౌర్ణమి తర్వాత వచ్చే నాలుగవ రోజు సంకష్టహర చతుర్థిగా వ్యవహరిస్తారు. మానవ జీవితంలో తలపెట్టిన పనులు ముందుకు పోనప్పుడు అన్నింటా విఘ్నాలు, అశాంతి, శారీరక రుగ్మతలు బాధిస్తున్న సందర్భంలోను, రుణ బాధలతో పాటు, జీవితంలో అనేక కష్టాలు ఎదుర్కొంటున్న సందర్భంలో సంకష్టహర చతుర్థి నాడు, యధాశక్తి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపితే ఈ కష్టాలన్నీ తొలగిపోతాయి అనేది ప్రతీతి. ఈ సందర్భంగా తహసీల్దార్ రవి నాయక్, డిప్యూటీ ఎంపీడీవో అంజనాదేవి, ఎస్సై నాగరాజు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు వేల మందికి అన్న సంతర్పణ కార్యక్రమం కొనసాగింది. సాయంత్రం వేళ ప్రదర్శించిన కోలాటం నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేకంగా పర్యవేక్షించింది.

## అసత్య ప్రచారాలు మానుకోండి



**చీరాల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతి లడ్డు విషయంలో అతస్య ప్రచారాలు మానుకోవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన కార్యదర్శి గూడూరు శివరామ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక జనసేన కార్యాలయంలో తిరుపతి లడ్డు విషయమై విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన కార్యదర్శి గూడూరు శివరామ ప్రసాద్, వేటపాలెం మండల జనసేన అధ్యక్షులు ఉగ్గిరాల మార్కండేయులు, చీరాల పట్టణ జనసేన నాయకులు అనుమకొండ కిషోర్, ఎరిచర్ల అశోక్ కుమార్, గోకుల్ కిరణ్‌లు మాట్లాడుతూ తిరుపతి లడ్డు విషయంలో వైసీపీ అసత్య ప్రచారాలు చేసి ప్రజాదరణ పొందాలని చూస్తున్నాని, రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ప్రజా ఆగ్రహానికి గురైన వైసీపీ పదకొండు సీట్లకు ప్రజలు పరిమితం చేశారని, ఇప్పటికైన తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ జనసేన అంతర్గత విషయాలపై ఉన్న శ్రద్ధ ప్రజలను పాలించడంలో చూపించాలని, జనసేన పార్టీ విషయాలపై అంత మక్కువ అవసరం లేదని అన్నారు. తిరుపతి వెంకటేశ్వరస్వామి జోలికి వెళ్లిన ఎవరిని స్వామి వదిలిపెట్టలేదని సిట్ అధికారులు ఏం చెప్పారో ప్రజలందరికి తెలుసని వాస్తవాలని వక్రీకరించి ప్రజలను పక్కదారి పట్టించలేరన్నారు. అంబటి రాంబాబు విషయాన్ని అడ్డం పెట్టుకుని కుల రాజకీయాలు చేస్తాను అంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని చట్టబద్ద పాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికైన వైసీపీ నేతలు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని సిట్ పూర్తి స్థాయి నివేదికలు అందించాక తిరుపతి లడ్డు దోషులకు చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టులందరికి అక్రిడేషన్లు మంజూరు చేయాలి

**- జిల్లా కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టులు**

**- జర్నలిస్టులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన డీజేఎఫ్**



**చీరాల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
జిల్లా వ్యాప్తంగా వివిధ పత్రికలలో పని చేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం అందించే అక్రిడిటేషన్ కార్డ్స్ సంబంధించి జనవరి 30వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన బాపట్ల జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో ప్రభుత్వ జీవోను 100 శాతం పూర్తి స్థాయిలో అమలు చేయడం వలన అనేక మంది చిన్న పత్రికలకు సంబంధించిన జర్నలిస్టులు అక్రిడిటేషన్‌లు పొందలేకపోయారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనేక సంవత్సరాలుగా పత్రికా రంగంలో కొనసాగుతూ గౌరవప్రదంగా ప్రభుత్వం అందించే అక్రిడిటేషన్ కోసం ఎన్నో సంవత్సఆలుగా ఎదురు చూస్తున్న పరిస్థితులలో ఈ విధంగా తీవ్ర అన్యాయం జరగడం వల్ల అనేక మంది నష్టపోవడం జరిగిందని కలెక్టర్‌కు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్‌గా మీకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో చర్చించి రెండవ జాబితాలో జర్నలిస్టులు అందరికి అక్రిడిటేషన్ మంజూరు అయ్యే విధంగా చొరువ చూపాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సర్కులేషన్ సాకుగా చూపించి కొన్ని పత్రికలను చిన్న పత్రికలుగా పేర్కొంటూ నిర్లక్ష్యం వహించే విధానానికి స్వస్తి పలికే విధంగా తగు చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కలెక్టర్‌ను కోరారు.

**జర్నలిస్టులతో సమావేశం :**
జర్నలిస్టుల సమస్యలపై జిల్లాలోని జర్నలిస్టులతో ముఖాముఖి ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారం కోసం చొరువ తీసుకోవాలని డెమోక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ ఎన్.నాగార్జునరెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ని కోరగా, సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలో జర్నలిస్టులతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో జంగం దాసు, వరదల మహేష్, జోగి సువర్ణ రాజు, కత్తి ఆజు, చేగూడి మరియదాసు, పసుమర్తి చైతన్య, కురువ వీరేశ్, డెమోక్రటిక్ జర్నలిస్టు ఎన్.నాగార్జునరెడ్డి, సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి వెంకట రమణ తదితరులు ఉన్నారు.

## శ్రీవారి తలపాగా వస్త్రాన్ని మగ్గంపై నేసిన ఎమ్మెల్యే మద్దులూరి



**చీరాల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
మహాశివరాత్రి పర్వదినాన శ్రీశైల మల్లన్నకు చేనేత రంగానికి చెందిన దేవాంగ సామాజిక వర్గం సమర్పించే తలపాగా వస్త్రాన్ని చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య చేనేత మగ్గంపై నేశారు. బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం, శ్రీశైల దేవస్థానం తలపాగా కార్యక్రమ వర్కింగ్ ప్రెసిడెంట్ భూసం శ్రీనివాసరావు, హస్తినాపురం బట్ట సాంబశివరావు ఆధ్వర్యంలో శాస్త్రయుక్తంగా భక్తిశ్రద్ధలతో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, గ్రామ సభ్యులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సముద్రంలో విద్యార్థుల గల్లంతు

**- పుట్టిన రోజు వేడుకలో భాగంగా సముద్ర స్నానానికి వెళ్లిన నలుగురు స్నేహితులు**

**- ఇద్దరు విద్యార్థులు గల్లంతు, ఇద్దరు క్షేమం**

**- రెవెన్యూ, పోలీసు, మెరైన్, అగ్నిమాపక శాఖ గాలింపు చర్యలు**



**చీరాల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
పుట్టిన రోజు వేడుకలు ఆ కుటుంబాల్లో విషాధం నింపాయి. సరదాగా గడపటానికి వెళ్లిన నలుగురిలో ఇద్దరు విద్యార్థులు గల్లంతు కాగా, ఇద్దరు క్షేమంగా ఒడ్డునే ఉన్నారు. చిన్నారుల గల్లంతుతో ఆయా కుటుంబాలు విషాధంతో వేదనకు గురవుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్చూరు నియోజకవర్గం దుద్దుకూరు గ్రామానికి చెందిన చందులూరి శ్రీరామ్(15) పుట్టిన రోజు సందర్భంగా దుద్దుకూరు జడ్పీ హైస్కూల్లో టెన్త్ క్లాస్ చదువుతున్న తోటి స్నేహితులు బిక్కి అవినాష్, శ్రీరామ్, తాటిపర్తి హేమంత్, గుంజి హేమవర్ధన్ నలుగురు విద్యార్థులు గురువారం సాయంత్రం మూడు గంటల సమయంలో ఒక బైక్ మీద చిన్నగంజాం మండలం బాపయనగర్ బీచ్ దగ్గర సముద్రంలో మునగడానికి వెళ్లారు. అవినాష్, శ్రీరామ్ ఇద్దరు సముద్రంలో నీట మునిగి ఆచూకీ తెలియలేదు. హేమంత్, హేమవర్ధన్ సముద్రం ఒడ్డునే ఉండటంతో క్షేమంగా ఉన్నారు. సమాచారం అందుకున్న మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో ఆచూకీ లేకుండా పోయిన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో జిల్లాలోని తీర ప్రాంతం ఉలిక్కిపడింది. విద్యార్థులు గల్లంతు కావడం పట్ల స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.





## వెంగళశెట్టికి చింతలపూడి పరామర్శ



**అద్దంకి , ఫిబ్రవరి 5,ప్రభాతవార్త**
పట్టణంలోని 19వ వార్డు వైసిపి నాయకులు వెంగళశెట్టి శ్రీనివాసరావుకు మతృవియోగం కలగగా గురువారం అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ వారి గృహానికి వెళ్ళి పరామర్శించారు. ఆయన వెంట పట్టణ పార్టీ అధ్యక్షులు కాకాని రాధకృష్ణమూర్తి, కౌన్సిలర్ జబ్బార్, పార్టీనాయకులు మోటుపల్లి చిన్న, హనుమంతరావు, సుబ్బారావుతోపాటు స్వాతి, తదితరులు వున్నారు. అదే విధంగా 18వ వార్డులో పితృయోగం జరిగిన బత్తుల కోటేశ్వరరావును కూడ ఆయన పరామర్శించారు.

## మున్సిపల్ డైలీ వేజ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి



**అద్దంకి , ఫిబ్రవరి 5,ప్రభాతవార్త**
మున్సిపల్ డైలీ వేజ్ కార్మికులను ఆప్కాస్ లో చేర్చాలి. అద్దంకి పురపాలక సంఘంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు అద్దంకి మండల కన్వీనర్ తంగిరాల వెంకటేశ్వర్లు, పాల్గొని మాట్లాడుతూ కోవిడ్ టైం లో అంతక మునుపు తీసుకున్న డైలీ వేజ్ కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించి ఆఫ్కాస్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చినా రూలింగ్ ను అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అద్దంకి మున్సిపాలిటీ లో పనిచేస్తున్న కార్మికులకు డైలీ వేజ్ కార్మికులకు 15వేల రూపాయలు ఆప్కాస్ కార్మికులకు 21వేల రూపాయలు ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు రకరకాల వేతనాలతో పనిచేయడం జరుగుతుందని, ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కార్మికులకు చట్ట ప్రకారం సమాన వేతనం ఇవ్వాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా రిటైర్మెంట్ మరియు చనిపోయిన కార్మికుల వారసులకు మున్సిపాలిటీలో వర్కర్స్‌గా అవకాశం కల్పించాలని మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని గత సమ్మకాలంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని ఇంజనీర్ విభాగం కార్మికులు తొమ్మిది రోజులు సమ్మె కాలపు వేతనాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అద్దంకి పట్టణం గత పది సంవత్సరాలు కాలంలో విస్తరించటం జరిగిందని పట్టణీకరణ కనుగోనంగా కార్మికులను అదనంగా పెంచాలని కోరారు. కార్మికులకు పని భారమై అనారోగ్యాల బారిన పడుతున్నారని ఏక కాలంలో బహుముఖ పనులు కార్మికులు చేస్తున్నారని తెలిపారు వెంటనే కౌన్సిల్ సమావేశంలో కార్మికులను రిక్రూట్మెంట్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబుకి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.ఆదాం, ఉసురుపాటి శామ్యూల్. కమిటీ సభ్యులు డి.అలివేలమ్మ, కృష్ణ, అంజమ్మ,జ్యోతి రాఘవయ్య, ఇంజనీర్ విభాగం అధ్యక్షులు జాన్ రవి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లకమ్మ నుండి ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్

**- మూడు ట్రాక్టర్లు, జెసిబి, పోలీసుస్టేషన్‌కు తరలింపు**









**అద్దంకి , ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నదినుండి జెసిబి ద్వారా ఇసుక ట్రాక్టర్లుకు లోడ్ చేస్తుండగా అద్దంకి ఆర్‌డిఓ ప్రసన్నలక్ష్మి, అద్దంకి తహశీల్దార్ శ్రీచరణ్‌లు పరిశీలనకు వెళ్ళగా ఆ వాహనాలను గమనించి, మూడు ట్రాక్టర్లను,ఒక జెసిబిని స్వాధీనం చేసుకొని అద్దంకి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీటిని సీజ్ చేసి తగిన పెనాల్టీ విధించనున్నట్లు తహశీల్దార్ వెల్లడించారు. ఇది ఇలా వుండగా ట్రాక్టర్‌కు మనుషుల ద్వారా ఇసుక నింపుకోవాలని, జెసిబిల ద్వార ఇసుక నింపటం చట్ట విరుద్దమని ఈ నేపద్యంలోనే జెసిబిని, ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు తహశీల్దార్ వెల్లడించారు. ఇది ఇలా వుండగా సాధారణ తనిఖీలో భాగంగా గుండ్లకమ్మలో పరిశీలనకు వెళ్ళగా ఇసుకతరలిస్తున్న పరిస్థితిని గమనించినట్లు ఆయన పేర్కొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు డీవైఎఫ్ఐ మద్దతు

**- విద్యార్థి సంఘం నాయకులని కిడ్నాప్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**



**దర్శి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
డీవైఎఫ్ఐ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య, కార్మికుల సమస్యల కోసం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని జాబ్ క్యాలెండర్‌ని ప్రకటించాలని కోరుతూ ఈనెల 12వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సమ్మెకు భారత ప్రజా తంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ పూర్తి మద్దతు తెలియజేస్తున్నట్లు డీవైఎఫ్ఐ ప్రకాశంజిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన దర్శిలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అదే విధంగా తిరుపతి జిల్లాలో విద్యార్థి సంఘం ఎస్‌ఎఫ్ఐ నాయకులు వినోద్ అక్బర్‌ని కిడ్నాప్ చేసిన మోహన్‌బాబు, యూనివర్సిటీని బ్లాక్‌లో పెట్టాలని ఆ యూనివర్సిటీలో ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి విద్యార్థుల నగదు 27 కోట్ల 60 లక్షలని కుంభకోణం చేశాని విద్యార్థులు తల్లిదండ్రులకు ఆ నగదు ఇవ్వాలని కోరిన ఎస్‌ఎఫ్ఐ నాయకుల్ని కిడ్నాప్ చేయటం అప్రజాస్వామికమని వెంటనే మోహన్‌బాబుని మంచు విష్ణుని అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ పీరా సాహెబ్, ఆర్‌జెస్సి పాల్, నాయకులు కొండలు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌కే సిబ్బందితో సమావేశం



**ముండ్లమూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
ముండ్లమూరుమండలంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆర్‌ఎస్‌కే సిబ్బందితో మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తిరుమలరావు మాట్లాడుతూ ప్రతి రైతు రబీ సీజన్ 2025-26 లో వేసిన ప్రతి పంటను పంట నమోదు(ఈ క్రాప్ బుకింగ్) చేసుకోవాలన్నారు. రబీ 2025 -26 సీజన్లో సాగు చేసిన ప్రతి పంటలను ఈ పంట నమోదు చేయాలని చెప్పారు. ఈ పంట నమోదు ఉన్న రైతులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులవుతారని చెప్పారు. అదే విధంగా రైతులకు అవసరం మేరకే యూరియా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

### ఊరి బడిని కాపాడుకుందాం పోస్టర్ ఆవిష్కరణ - యూటీఎఫ్



**దర్శి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
స్థానిక యూటీఎఫ్ భవన్ నందు ఊరిబడిని కాపాడుకుందాం అనే పోస్టర్‌ను జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ హై చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ బడి అమ్మవంటిదని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య లక్షల్లో తగ్గిపోతుందని, బడుగు బలహీన వర్గాల పిల్లలు మాత్రమే ప్రభుత్వ బడుల్లో ఉన్నారని ఊరి బడి కోల్పోయినట్లయితే పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతారని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కులను దూరం చేసుకోవడమే అవుతుందని యుటీఎఫ్ సంఘం భావిస్తోందని జిల్లా కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ హై మాట్లాడారు. జిల్లా కార్యదర్శి టి.రాజశేఖర్, కోటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, కుటుంబ సంక్షేమ డైరక్టర్ జి.విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.ఖాశీం, కే.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వర్లు, ఎస్.తిరుపతిరెడ్డి, వి.రామిరెడ్డి, ఎస్.ఏడుకొండలు, జే.రవికుమార్, బి.అంజినాయక్, కే.రామారావు, ఆర్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

